నేడు పదో తరగతి ఫలితాల విడుదల

- జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాసిన 22,281 మంది విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: పదో తరగతి ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగగా మంగళవారం ఉదయం 11గంటలకు ఫలితాలు విడుదల కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 22,281 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. దీంతో పరీక్షా ఫలితాల కోసం తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులు వేచి చూస్తున్నారు.



బోధన్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జిల్లాకు కేంద్ర బలగాలు

- సమస్యాత్మక ప్రాంతాల్లో బలగాల కవాతు
- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పోలీసుల చర్యలు

ఖిల్లా/బోధన్‌రూరల్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర బలగాలు జిల్లాలో మోహరించాయి. డివిజన్, మండల కేంద్రాల్లో ఉంచి బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు. సోమవారం నగరంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. ప్రత్యేక పోలీసు బృందాలతో నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా ఓటు హక్కును నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో నిజామాబాద్ ఏసీపీ. ఎల్.రాజ వెంకటరెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మా ట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు పోలీసు భద్రతను పటిష్ఠం చేశామన్నారు. ఎన్నికల కమిషనర్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వీరయ్య, రూరల్ సీఐ కోలా నరేష్, ఎస్‌ఐ నాగనాథ్‌లతో పాటు సీఆర్‌పీఎఫ్ జవాన్లు తదితరులున్నారు.



నగరంలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీసు బృందం



ఎన్నికల బరిలో 29 మంది అభ్యర్థులు

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ
- ముగ్గురు అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ
- ఎంపీ ఎన్నికల బరిలో మొత్తం 29 మంది అభ్యర్థులు
- ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రుల పోటీ
- పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లలో అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల పోటీపై స్పష్టత వచ్చింది. నామినేషన్ల విత్‌డ్రా గడువు ముగియడంతో అధికారులు పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం 42 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా వారిలో 10 మంది సరైన పత్రాలు సమర్పించకపోవడంతో అధికారులు తిరస్కరించారు. సోమవారం నామినేషన్ల విత్‌డ్రాకు చివరి రోజు కావడంతో పోటీలో ఉన్న 32 మందిలో కేవలం ముగ్గురు అభ్యర్థులు మాత్రమే తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 29 మంది అభ్యర్థులు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రధాన పార్టీలైన బీజేపీ నుంచి ధర్మపురి అర్వింద్, బీఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ నుంచి టి.జీవన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. వీరే కాకుండా బీఎస్పీ తరఫున పుప్పాల లింబాద్రి, బహుజన లెఫ్ట్‌పార్టీ తరఫున అబ్బగోని అశోక్‌గౌడ్, అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మన్సూర్ అలీ, ధర్మ సమాజ్ పార్టీ నుంచి కండెల సుమన్, యుగ తులసి పార్టీ నుంచి సాయికృష్ణమూర్తి, దళిత బహుజన పార్టీ నుంచి గోలి నరేష్, బహుజన ముక్తి పార్టీ నుంచి దేవతి శ్రీనివాస్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి బూక్యనంద్, ఇండియా ప్రజాబంధ్ పార్టీ నుంచి మొగిలి రాజ్‌కుమార్, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్‌డ్ పార్టీ నుంచి యోగేందర్‌గట్ల పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొత్తకొండ శక్తి ప్రసాద్, కోటగిరి శ్రీనివాస్, గంట చరితరావు, గోపిచంద్రయ్య, తుటుకూరు జీవన్‌రెడ్డి, దేశబోయిన లక్ష్మీనారాయణ, బీబీనాయక్, సాయినిఖిల్, ప్రశాంత్ కత్రాజు, మాలావత్ విఠల్, రాగి అనిల్, రాపెల్లి సత్యనారాయణ, రాపెల్లి శ్రీనివాస్, వేముల విక్రమ్ రెడ్డి, సయ్యద్ అస్గర్‌లు బరిలో నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రకటించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ సమక్షంలో అభ్యర్థులతో అధికారులు భేటీ అయ్యారు. తెలుగు అక్షరాల క్రమసంఖ్యను బట్టి గుర్తులను కేటాయించారు. ఈ ఎన్నికల్లో నామినేషన్ వేసిన రఘు, నవీన్, పోతు నాగార్జున తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు.



అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమంలో అధికారులు

పోలింగ్‌కు అధికారుల ఏర్పాట్లు

ఈ ఎన్నికల నామినేషన్ విత్‌డ్రా ఘట్టం ముగియడంతో అధికారులు ఎన్నికల పోలింగ్ కోసం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఈవీఎంలను అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపించిన అధికారులు ఓటరు లిస్టును కూడా ప్రకటించారు. ఈ ఎన్నికల కోసం భారీ బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర బలగాలు ఇప్పటికే జిల్లాకు రాగా వాటిని డివిజన్, మండల కేంద్రాల్లో ఉంచి బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు.

మొత్తం 17,04,867 మంది ఓటర్లు

ఈ పార్లమెంట్ పరిధిలో మొత్తం 17లక్షల 4,867 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వారు ప్రకటించారు. వీరిలో పురుష ఓటర్లు 8 లక్షల 6,130 మంది, మహిళా ఓటర్లు 8లక్షల 98,647 మంది ఉండగా ఇతర ఓటర్లు 90 మంది ఉన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో మొత్తం 1,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఆర్మూర్‌లో 217, బోధన్‌లో 246, నిజామాబాద్ అర్బన్‌లో 289, నిజామాబాద్ రూరల్‌లో 293, బాల్కొండలో 247, కోరుట్లలో 262, జగిత్యాలలో 254 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మే 13న పోలింగ్ జరగనుండటంతో అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో మౌలిక వసతులను కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఇవేకాకుండా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లను చేయడంతో పాటు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. కొత్త ఓటర్లను దృష్టిలో పెట్టుకొని ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉద్యోగుల ర్యాండమైజేషన్ పూర్తి

ఈ ఎన్నికల కోసం ముందస్తుగానే ఉద్యోగుల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారందరికి శిక్షణ ఇచ్చారు. మొత్తం 8వేల మంది ఉద్యోగులను పోలింగ్ కోసం వినియోగిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఒక్కొక్కదానికి ముగ్గురు చొప్పున వినియోగించడంతో పాటు అదనంగా 30 శాతం సిబ్బందిని ఉంచారు. అవసరమైన చోట వీరిని వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల కోసం ముందస్తుగానే గుర్తింపు పొందిన పార్టీల సమక్షంలో ఈవీఎంలను తనిఖీలను చేసి అసెంబ్లీ సెగ్మెంట్‌లకు పంపించారు. భారీ భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచారు. పోలింగ్ ముందురోజు వాటిని కేంద్రాలకు తరలించనున్నారు. ఈ ఎన్నికల కోసం భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా పోలీసులతో పాటు కేంద్ర బలగాలను కూడా జిల్లాకు రప్పించారు. మొత్తం 3500లకు పైగా సిబ్బందిని బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు. పోలింగ్‌కు ఇంకా 14 రోజుల సమయం ఉండటంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.

దేశం సుభిక్షంగా ఉండాలంటే మోదీతోనే సాధ్యం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

నిజామాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశం సుభిక్షంగా ఉండాలన్నా.. సంపూర్ణ భద్రత కావాలన్నా.. అది ప్రధాని మోదీ పాలనతోనే సాధ్యమని బీజేపీ అభ్యర్థి ఎంపీ అర్వింద్ అన్నారు. నగరంలోని శ్రీరామగార్డెన్‌లో సోమవారం నిర్వహించిన యువ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. దేశంలో ధర్మం కొనసాగాలన్న అది మోదీతోనే సాధ్యమన్నారు. బీజేపీ మూడోదఫా అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎప్పుడు మతకల్లోలు, టెర్రరిస్టుల దాడులు జరిగేవన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా అలాంటి దాడులు జరగడం లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో దాడులు జరిగితే అగ్రరాజ్యమైన అమెరికా వైపు చూస్తూ ప్రాధేయపడే వారని ఆయన ఆరోపించారు. సహాయం చేయాలని దేశ ప్రధానులు ఆ దేశాన్ని కోరేవారన్నారు. ప్రధానిమోదీ అధికారం చేపట్టాక అమెరికా లాంటి దేశాలు కూడా తమను సహాయం చేయాలని అడుగుతున్నాయని ఆయన యువతకు గుర్తు చేశారు. ప్రధాని మోదీ అధికారంలోకి రాగానే యువత కోసం స్టార్టప్‌లను ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ హయాంలో 300 స్టార్టప్‌లు ఉంటే ప్రస్తుతం దేశంలో లక్షకు పైగా ఉన్నాయని అన్నారు. దేశం గ్లోబల్ ర్యాంకింగ్‌లో మూడోస్థానంలో నిలిచిందన్నారు. యువత స్టార్టప్‌లు స్థాపించి తాము ఎదగడంతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని ఆయన అన్నారు. యువత ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారితో పాటు యువకులు ఓటు వేసేటప్పుడు అన్ని ఆలోచించి వేయాలన్నారు. ఎవరూ అభివృద్ధి చేస్తారో ఎవరి వల్ల దేశానికి ఉపయోగం ఉంటుందో గుర్తించి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చా రు. కాంగ్రెస్ లాంటి వాటిని ఆదరిస్తే మళ్లీ ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులే వస్తాయని ఆయన విమర్శించారు. ఈ సమ్మేళనంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ నేతలు పల్లె గంగారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రణధీర్, జితేందర్ వైద్యతో పాటు పలువురు పాల్గొన్నారు.





యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న ధర్మపురి అర్వింద్

లోకల్‌గా ఉండే అభ్యర్థికి అవకాశం ఇవ్వాలి

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో పక్కా లోకల్‌గా ఉండే వ్యక్తికి అవకాశం ఇవ్వాలని, ప్రజల సమస్యలు తీర్చే వాడికి పట్టం కట్టాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. నగరంలోని వర్నిరోడ్‌లోగల జనార్దన్ గార్డెన్‌లో సోమవారం జరిగిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నాన్ లోకల్ వ్యక్తుల వల్ల ప్రజలకు ఉపయోగం లేదన్నారు. శాసనసభ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి అమలు కాని హామీలను ఇచ్చారని అన్నారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ రైతులను మోసం చేశాడని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ నల్లధనాన్ని వెలికితీసి ప్రతి ఒక్కరికీ 15లక్షల రూపాయలను ఇస్తానని అన్నారు. ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ రాముడిని అడ్డం పెట్టుకొని గెలవాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్త పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు డ్రామాలు చేసి ఈ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి ఆరోపించారు. ఈ సమావేశంలో మేయర్ దండు నీతూకిరణ్, నగర అధ్యక్షుడు సిర్పరాజు, నేతలు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

గెలిపిస్తే చక్కెర ఫ్యాక్టరీని పునః ప్రారంభిస్తాం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 29: ఎంపీగా తనను గెలిపిస్తే బోధన్ చక్కెర కర్మాగారాన్ని వచ్చే ఏడాది పునఃప్రారంభించే బాధ్యత తీసుకుంటానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంకాపూర్‌లో చాయ్‌పే చర్చ, ఆర్మూర్, ఆలూర్ మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తామని, గల్ఫ్ వెళ్లి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచి, వారికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. గల్ఫ్ కార్మికుల పిల్లలను గురుకులాల్లో విద్యాబోధన సౌకర్యం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని రుణమాఫీ చేసి ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని జీవన్‌రెడ్డి తెలిపారు. బీజేపీ రైతు వ్యతిరేక పార్టీ అన్నారు. పదేళ్ల నుంచి బీజేపీ చేసిన అభివృద్ధి ఏమిలేదని దేవుడి పేరు చెప్పి ప్రజ లను మభ్యపెట్టి ఓట్లు అడుగుతున్నారని ఆయన విమర్శించారు.

రైతులు కాంగ్రెస్‌కు అండగా నిలవాలి..

రానున్న ఎన్నికల్లో రైతులందరూ తనకు అండగా నిలిచి గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి కోరారు. ఆర్మూర్ పట్టణంలోని ఐదు పంతల మున్నూరుకాపు కులస్థుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల భావనలు, ఒకే విధంగా ఉంటాయ న్నారు. అర్గుల్ రాజారాం ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని అన్నారు. ఉత్తర తెలంగాణలోనే అతి పెద్ద మామిడి మార్కెట్‌ను జగిత్యాల్‌లో ఏర్పాటు చేయించామని, అదే విధంగా జగిత్యాల్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయించామన్నారు. వ్యవసాయ రంగం రైతాంగంపై తనకున్న ప్రత్యేక శ్రద్ధకు ఇదీ నిదర్శనమన్నారు. రైతులందరు తనకు అండగా నిలిచి గెలిపిస్తే అందరికి అందుబాటులో ఉండి సేవ చేస్తానని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి



పసుపునకు డిమాండ్

- జిల్లాలో పసుపునకు పెరిగిన ధర
- ఏర్గట్ల గ్రామానికి చెందిన రైతు క్వింటా పసుపునకు రూ.18,489

నిజామాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పసుపునకు ధర భారీగా పెరుగుతోంది. రోజురోజుకూ పసు పునకు డిమాండ్ ఏర్పడుతోంది. సాగు విస్తీర్ణం తగ్గినా.. ఈ యేడు మాత్రం ధర రైతులకు కలిసి వస్తుం ది. పసుపు సాగు చేసిన వారికి నష్టా లు మిగిల్చకుండా లాభాలను తీసుకువస్తోంది. గడిచిన నాలుగు నెలలుగా పసుపు అమ్మకాలు కొనసాగుతుండగా ధర కూడా పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.18వేలు దాటి ధర వస్తుంది. ఇప్పటి వరకు తీసుకువచ్చిన రైతులకు ఈయేడాది గిట్టుబాటు ధర రావడంతో పాటు నిలువ ఉంచిన రైతులకు ఎ క్కువ మొత్తంలో ధర పలుకుతోంది. వ్యాపారులు కూడా ఈయేడు ధరలు పెరుగుతుండడంతో పోటీపడి పసుపు కొనుగోలు చేస్తున్నారు.

మార్కెట్‌లో సోమవారం అత్యధిక ధర

నిజామాబాద్ మార్కెట్‌లో సోమవారం జరిగిన పసుపు అమ్మకాల్లో ధర అత్యధికంగా పలికింది. ఏర్గట్లకు చెందిన గూండ్ల ముత్తెన్న అనే రైతు పసుపుకు క్వింటాలు 18,489 రూపాయల ధర పలికింది. ఆ రైతు పది క్వింటాలకు పైగా పసుపు తీసుకురాగా అత్యధికంగా ధర వచ్చింది. నిజామాబాద్ మార్కెట్‌కు సోమవారం రోజు మొత్తం 4,700 క్వింటాలకు పైగా పసుపు మార్కెట్‌కు వచ్చింది. దీంట్లో కాడి రకానికి అత్యధికంగా క్వింటాలు 18,489 రూపాయలు ధర వచ్చింది. మార్కెట్‌లో కాడి సరాసరి 8,600 నుంచి 16,250 రూపాయల మధ్య ఎక్కువ మొత్తంలో అమ్మకాలు జరిగాయి. కొద్దిమంది రైతులకు 16వేల నుంచి 18,489 రూపాయల మధ్య ధర వచ్చింది. గోల రకానికి సరాసరి 8వేల నుంచి 16వేల రూపాయల మధ్య క్వింటాలుకు ధర పలికింది. ఈ యేడాది ప్రారంభం నుంచి ధర పసుపునకు పెరుగుతూ వస్తోంది. కొంత మంది రైతులకు ఎక్కువ మొత్తంలో ధర వస్తుంది. సరాసరి క్వింటాలు 8వేల నుంచి 16వేల మధ్యన ఎక్కువగా ఈ నాలుగు నెలల కాలంలో అమ్మకాలు జరిగాయి. గత సంవత్సరం అమ్మకాలతో పోలిస్తే ఈ సంవత్సరం రైతులకు డబుల్‌కు మించి ధర వచ్చింది. ఈ మార్కెట్‌లో ఇప్పటి వరకు నాలుగు నెలల్లో మొత్తం 4లక్షల క్వింటాల వరకు పసుపు క్రయవిక్రయాలు జరిగాయి. ఈ సంవత్సరం సాగు తగ్గడం వల్ల ఎక్కువ మొత్తంలో పసుపు రావడం లేదు. గత సంవత్సరం 10లక్షల క్వింటాల వరకు మార్కెట్‌లో కొనుగోలు చేశారు. మార్కెట్‌కు పసుపు తీసుకువచ్చే రైతులకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని మార్కెట్ కార్యదర్శి వెంకటేశం తెలిపారు.


ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్న అధికారులు

‘ఓటర్ స్లిప్‌లను సకాలంలో పంపిణీ చేయాలి’

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటర్లకు ఓటర్ స్లిప్‌లను సకాలంలో పంపిణీ చేయాలని ఎన్నికల సెక్టోరియా అధికారి, డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని మునిపల్లి, లక్ష్మాపూర్, నారాయణపేట్, అర్గుల్ గ్రామాల్లో ఓటర్ స్లిప్‌ల పంపిణీ తీరును ఆయన పరిశీలించారు. అంగన్‌వాడి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఓటర్ స్లిప్‌లను అందజేయాలని సూచించారు.

వేసవి సెలవుల్లో హాస్టళ్లు తెరిచి ఉంచాలి

● రిజిస్ట్రార్ కు వినతి పత్రం అందజేసిన ఏబీవీపీ నాయకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: యూనివర్సిటీ వేసవి సెలవుల్లో హస్టళ్లు తెరిచి ఉంచాలని ఏబీవీపీ నాయకులు సోమవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి కి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు బోజన వసతికల్పించాలని , విద్యా ర్థులంత పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారని, మెస్ బిల్లులు వర్సిటీ భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయ కులు శివా, సాయి, అమృత్ చారి, వినోద్, సంతోశ్, పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: తెలంగాణవిశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల పీజీ పరీక్షలు 5వ రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్, ఐఎంబీఏ 10వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ,ఎల్ఎల్ ఎం 1వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 358 పరీక్షలకు హాజకావల్సిన ఉండా 331 పరీక్షకు హాజరయ్యారని 20మంది గైర్హాజర య్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఎడపల్లికి సుదర్శన్‌రెడ్డి రాక

ఎడపల్లి, ఏప్రిల్ 29: మాజీమంత్రి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుద ర్శన్ రెడ్డి నేడు ఎడపల్లికి రానున్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం 9 గంటలకు ఎడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొనేందుకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామా బాద్ పార్లమెంటు అభ్యర్థి జీవన్ రెడ్డిలు ఎడపల్లి వస్తున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

హోటళ్లలో కొనసాగుతున్న ఆహారంలో కల్తీ..!

- రంగులతో ఆకట్టుకుంటున్న ఆహారపదార్థాలు
- విచ్చలవిడిగా రసాయనాల వాడకం
- ప్రజల ప్రాణాలతో వ్యాపారుల చెలగాటం
- శుచి...శుభ్రతను గాలికి వదిలేస్తున్న హోటళ్లు
- అడిగేవారు లేక యధేచ్ఛగా దందా

బోధన్ రూరల్, ఏప్రిల్ 28: బోధన్ డివిజన్‌తో పాటు జిల్లా కేంద్రంలోని హోటళ్లలో కడుపారా భోజనం చేయాలంటే ఒకింత ఆలోచించాల్సిందే.. వేలాది మందితో రద్దీగా ఉండే బోధన్ డివిజన్‌తో జిల్లా కేంద్రంలో అడ్డగోలుగా నిర్వహిస్తున్న హోటళ్లు, దాబాలు, కర్రీ పాయింట్లు, రెస్టారెంట్లకు అడ్డాగా మారింది. డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకుంటున్న హోటల్ నిర్వహకులు శుచి శుభ్రతను గాలికొదిలేస్తున్నారు. ఫలితంగా ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పు వాటిల్లుతోంది. ఏదో ఒక పని మీద బోధన్‌తో పాటు జిల్లా కేంద్రనికి వచ్చేవారు కాస్త ఆలస్యమైతే కడుపునింపుకోవడం కోసం హోటల్‌కు వెళ్లక తప్పదు. అలాంటి వారికి కాస్త శుచి రుచితో కూడిన భోజనం పెట్టాల్సిన నిర్వాహకులు కలుషిత భోజనాన్ని వడ్డించి అడ్డగోలు రోగాలకు ఆజ్యం పోస్తున్నారు. కుళ్లిన ఆహర పదార్థాలనే మళ్లీ మళ్లీ తయారు చేసి కల్తీ దందాకు తెరలేపుతున్నారు. రంగురంగుల రసాయనాలు కలుపుతూ ఆకర్షణీయంగా రకరకాల పేర్లతో వంటలు తయారు చేసి కాసులు మూటగట్టుకుంటున్నారు. ప్రశ్నించేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాగునీటి నుంచి తినే అహరం దాకా ఎక్కడ కూడా శుభ్రతను పాటించడం లేదని జిల్లా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వెయిటర్‌లు జాగ్రతలు పాటించకపోవడం వల్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తలకు క్యాప్, మూతికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు ధరించకుండా తినుబండారాలు వడ్డిస్తున్న పట్టించుకునే దిక్కులేదని జిల్లా ప్రజలు, మాస్టార్లు పాన్ పరాగ్‌లు నములుతూ వంటలు చేయడం ఇక్కడ సర్వసాదారణమే.. డివిజన్‌లో వైన్స్ షాపుల వద్ద డ్రైనేజి పక్క జాగ్రత్తలు పాటించకుండా ఆహారపదార్థాలను విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అదే విధంగా కేక్‌ల పేరిట జిల్లాలో విచ్చలవిడిగా టీ విక్రయ కేంద్రాల్లో తయారు చేసే సమోసాలు, మిఠాయిలు, ఇతర ఆహరపదార్థాలపై ఈగలు, దోమలు,ఇతర క్రిమికీటకాలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవడం లేదు.



కల్తీను నూనెను పోస్తున్న దృశ్యం(ఫైల్)



కల్తీ ఆహారాన్ని తయారు చేస్తున్న దృశ్యం (ఫైల్)

● కలర్‌ఫుల్ కెమికల్ పూతలు

ప్రమాదకర రసాయనాలు లేడ్‌క్రోమేట్,సింధటిక్ కలర్,మెటానిక్ ఎల్లో, ట్రెటాజన్ సుడాన్,ఆహారం ఆకర్షణీయమైన గులాబీ రంగు వచ్చేందుకు వాడే రోడామిన్ వంటి రంగులను ఆహారపదార్థాలతో మ్రిశమం చేస్తుండగా బహిరంగ రహస్యమే వీటితో ప్రమాదకరమైన కేన్సర్,లివర్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

● జాడలేని తనీఖీలు

బోదన్ డివిజన్‌లతో పాటు జిల్లా కేంద్రంలో అట్టహసంగా కనిపిస్తున్న హోటళ్ల మటున అక్రమ కల్తీ దందా జోరుగా కొనసాగుతోంది. హోటళ్లలో పనిచేసే కులీలు వ్యక్తిగత పరిశ్రుభత పాటించకపోవడం, వంటకాల తయారీలో కల్తీ ఆహర వస్తువులు వినియోగించడం లాంటి అక్రమాలు షరామాముల్తైపోతున్నాయి.సంవత్సర క్రితం జిల్లా క్రేందంతో పాటు బోదన్ డివిజన్‌లో సానిట్రైజర్ ఇన్‌స్పేషర్ అకస్మాత్తుగా హోటళ్లను తనిఖీ చేసి ఆహర కల్తీ వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. దింతో వెంటనే రంగంలోకి దిగిన అప్పటి అదికారులు, స్వయంగా తనీఖిలు చేప్పటంతో కుళ్లిన మంసహరం,ఫ్రీజర్లలో నిల్వఉంచిన మాంసం, రసాయనాలు కలిపిన ఆహర పదార్థాలు గుర్తించారు.వెంటనే ఫుడ్ సేఫ్టి అధికారులను పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిదిగా, ఆదేశించారు. దీంతో కల్తీ దందా కాస్త పక్కన బెట్టి మళ్లి షూరు చేశారు.

అంత కల్తీమయంగా మారింది



హోటళ్లలలో అంత కల్తీ నూనె వాడుతున్నారు. మండి హోటళ్లలలో భోజనం చేయాలంటే భయమేస్తుంది. హోటళ్లలలో శుభ్రత పాటించడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని కల్తీని అరికట్టేందుకు కృషి చేయాలి.

- లక్ష్మణ్ చౌహాన్, బోధన్

నిబంధనలు అత్రికమిస్తే క్రిమినల్ కేసులు



ఆహార పదార్థాల నాణ్యతప్రమాణలను ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూనే ఉన్నాం.కుళ్లిన ఆహార పదార్థా లను కాలం చెల్లిన వాటిని విక్రయిస్తే క్రిమినల్ కేసు లు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసు కుం టాం. ఆహారపదార్థాల నాణ్యత విషయంలో బోధన్ ప్రజలకు హోటల్ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నాము. సిబ్బంది కొరత కారణంగా పని భారంపెరుగుతుంది.అయినప్పటికి ఎక్కడ కూడా తనీఖీల పట్ల నిర్లక్ష్యం చేయడం లేదు.

- బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ

'పార్లమెంట్ ఎన్నికలలో మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ బాబు

బోధన్‌రూరల్,ఏప్రిల్29: పార్లమెంట్ ఎన్నికలలో మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. సోమవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికలలో ఇండియా కూటమిని బల పర్చి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ ప్రజ సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. జీఎస్టీ పేరుతో ప్రజలను, వ్యాపార వేత్తలను బీజేపీ సర్కారు దోచుకుంటుందని విమర్శించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోలేదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆస్తులైన బ్యాంకులు, ఎల్ఐసీ, రైల్వే, బొగ్గు గనులు, రక్షణ రంగం మొదలగు సంస్థలను కార్పొరేట్ సంస్థలను నరేంద్ర మోడీ దోచి పెడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యదర్శి శంకర్ గౌడ్, నుర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు ఏశాల గంగాదర్, నన్నేసాబ్, పట్టణ కమిటీ సభ్యులు కుమారస్వామి, దాసి, గోపి తదితరులు పాల్గొన్నారు.

తిరోగమన వాదులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలి



మాట్లాడుతున్న సుధాకర్

పెద్దబజార్, ఏప్రిల్ 29:దేశంలో పేట్రేగిపోతున్న ఫాసిస్టు శక్తులను తిరోగమన వాదులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. సోమవారం నగరంలోని కోటగల్లిలోగల శ్రామిక భవన్‌లో కాకతీయ యూనివర్సిటీలో లౌకిక విలువలు సాహిత్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా జరుగుతున్న సదస్సులో చొరబడి పాసిస్టు మూక అల్లరి సృష్టించడాన్ని ప్రముఖ కవులు డాక్టర్ రవీందర్, మేర్సి మార్గరేట్ నరేష్‌కుమార్ సూఫి, భూపతివెంకటేశ్వర్లు, బిల్లా మహేందర్ తదితరుల మీద దాడి చేసి గాయపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలో లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలనే లక్ష్యంతో రాజ్యాంగ స్ఫూర్తితో సాహిత్య సదస్సు జరుపుకుంటే ఈ దారుణం చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యరాణి, గణేష్, మారుతి, విఠల్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో మేడే పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి .జేపీ గంగాధర్ బీడీ కార్మిక నాయకులతో కలిసి సోమవారం మేడే దినోత్సవం పురష్కరించుకొని పోస్టర్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో కార్మికులకు చేసింది శూన్యమని దేశ సంపద అంబానీ, ఆదానీ లకు మోదీ దోచిపెడుతున్నరని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుప్రియ, లక్ష్మీ, సుజన, అరుణ, భావన, పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందిపై కేసు నమోదు

● ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష

ఖిల్లా, ఏప్రిల్ 29:మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ టి.నారాయణ నేతృత్వంలో ప్రతిరోజు తనిఖీలు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకట నారాయణ తెలిపారు. ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీలు చేస్తుండగా 25 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించి సోమవారం ఉదయం కోర్టు మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ముందట హాజరుపర్చామన్నారు. వీరిలో 23 మందికి 22,500 రూపాయల జరిమానా, మరో ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ముప్కాల్ పాఠశాలలో చోరీ

ముప్కాల్, ఏప్రిల్29: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గుర్తుతెలియని దొంగలు భీభత్స సృష్టించారు. ఈనెల 24నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పాఠశాలకు తాళలు వేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు ఉపాధ్యాయులు వచ్చి చూడగా నాలుగు గదుల తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తుతెలి యని దొంగలు తాళలు పగులగొట్టి ఉండవచ్చని, పాఠశాలలోని ఎల క్ట్రానిక్, వస్తువులు, సౌండ్ బాక్సులు, తదితర వస్తువులు ఎత్తు కెళ్ళారని పాఠశాల సిబ్బంది తెలిపారు.

డొంకేశ్వర్‌లో ఉరేసుకొని మహిళ మృతి

డొంకేశ్వర్ ఏప్రిల్29: ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని మహిళ మృత చెందిన సంఘటన డోంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో జరిగింది. నూత్‌పల్లి గ్రామానికి చెందిన ఉమా (26) గత ఐదేళ్ళ క్రితం భర్త మృతి చెందడంతో ఆర్థిక పరిస్థితి బాగోలేక మానసికంగా కుంగిపోయింది. సోమవారం కుటుంబసభ్యులు బాడ్సి గ్రామానికి పెళ్ళికి వెళ్ళాన మనస్థాపం చెందిన ఉమా ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందింది. పోలీసులు సంఘ టన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాహుల్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

బోధన్‌రూరల్,ఏప్రిల్29: బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బీ.అనురాధ(30)అనే వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకుందని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, భర్త చెడు వ్యసనాలకు బానిసవ్వడంతో ఇంట్లో ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉందన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి పట్టివేత

● రెండు కిలోల 100 గ్రాముల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వినయ్

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్29: వేల్పూర్ మండలం వెంకట్రాపూర్ రోడ్డు వద్ద సోమవారం గంజాయి తరలిస్తున్న అరెస్టు చేసి ఇద్దరు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్టు వేల్పూర్ ఎస్సై వినయ్ తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన సయ్యద్ అజీం, షేక్ అద్నాన్‌సోహెల్ బాల్కొండ, వేల్పూర్, భీమ్‌గల్ మండలాలకు చెందిన యువతకు గంజాయి సరఫరా చేయడానికి వస్తున్నారన్నా సమాచారం రావడంతో నిఘా వేసి పట్టుకున్నామన్నారు. వెంకటాపూర్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో వారిని అపి తనిఖీ చేయగా సుమారు రెండు కిలోల 100గ్రాముల గంజాయి లభించిందన్నారు. మహరాష్ట్ర నుంచి తక్కువ రేటుకు గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నామని నేరాన్ని అంగీకరించారన్నారు. ఈ సందర్భంగా ఎస్సై వినయ్ మాట్లాడుతూ వేల్పూర్ మండలంలోని యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి తాగడం చట్టరీత్య నేరామన్నారు. ఈ సమా వేశంలో ముప్కాల్ ఎస్సై బాస్కరచారి, విజయ్, సందీప్, శ్రావణ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎడపల్లి, ఏప్రిల్ 29: ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫా రం గ్రామంలో గల బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్టు భూమయ్య అనే వ్యక్తి మరణించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామానికి చెందిన మెట్టు భూమయ్య (52) అనే వ్యక్తి తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో ఎమ్మెస్సీ ఫా రంలో గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోసుకుని వస్తుండగా నిజామాబాద్ నుంచి వస్తున్న డీసీఎం వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడిక్కడే మరణించాడు.మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్థాపం చెందిన వృద్ధురాలి ఆత్మహత్య

ముప్కాల్, ఏప్రిల్29: తన కొడుకుకు అయిన అప్పుల గురించి మనస్థాపం చెందిన తల్లి వరదకెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం పాతకల చిన్నుబాయి(70) తన కొడుకు పాతకాల ప్రవీన్ చేసిన అప్పుడు విషయంలో బాధపడుతూ మనస్థాపానికి గురైంది. ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయలుదేరి కిసాన్‌నగర్ ఎస్సారెస్పా వరదకాలువపై దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు కొడుకు ప్రవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులను ఓడించాలి

పెద్దబజార్, ఏప్రిల్ 29: ప్రపంచ కార్మికులారా ఏకం కండి... మతోన్మాద, విచ్చిన్నకర శక్తులను ఓడించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో మేడే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారుల పాలకవర్గ దోపిడీ దాడులు అనచివేతకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించుకుంటూ వర్గ ఐక్యతను కాపాడుకున్న శ్రామిక ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రమదోపిడికి వ్యతిరేకంగా 8గంటల పనిదినం కోసం కార్మిక హక్కుల రక్షణ కై మేడే పోరాటంలో తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంగాధర్, లక్ష్మి, విజయ, కొండ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మే 7 వరకు డిగ్రీ పరీక్షల ఫీజు గడువు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు చెందిన 1,3,5 వసెమిస్టర్ బ్యాక్‌లాగ్, 2019 నుంచి 2023 వరకు బ్యాచ్‌లకు చెందిన వారికి ఫీజు సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లించుకునేందుకు మే 7 వరకు గడవు ఉందని కంట్రోలర్ ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 100రూ.అపరాధ రుసుముతో మే 8 వరకు చెల్లించుకోవచ్చు అని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన బ్రాంచ్ మేనేజర్లకు సన్మానం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్లపై అధికవడ్డీ మరియు ఎన్‌పీఏలో తగ్గింపు ఉందని అందుకు బ్యాంకు ఉద్యోగుల యొక్క సమిష్టి కృషే కారణమని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. గత ఏడాదికంటే ఈ ఏడాది డిపాజిట్లలో పెరుగదల కనిపించిందన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైజనింగ్ మరియు మార్కెటింగ్ హబ్ రికవరీ అండ్ సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్‌ను ఆవిష్కరించారు. బ్రాంచ్ మేనేజర్లందరూ బ్యాంకు అభివృద్ధిలో తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెంట్రాజ్‌పల్లి రైతులకు అవగాహన

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో నేడు కూరగాయాల సాగు, మట్టి నమూన పద్దతులపై రైతులకు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వార శాస్త్రవేత్తలు అవగహన కల్పిస్తారని వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు తెలిపారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఖిల్లా, ఏప్రిల్ 29: రైల్వేస్టేషన్‌కు వస్తున్న రైలు ముందుకు దూకి యువకుడు ఆత్మ హత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ.సాయిరెడ్డి తెలిపారు. రాత్రి రైల్వేస్టేషన్ అజంతా ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లోనికి రాగానే ప్లాట్‌ఫాంపై ఉన్న యువకుడు హఠాత్తుగా రైలుకు అడ్డంగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. యువకుడి వివరాలు తెలియరాలేదన్నారు. యువకుడు వైలెట్‌కలర్ షర్ట్, బ్లూకలర్ జీన్ పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తుపట్టడానికి తమను సంప్రదించాలని సూచించారు.

చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: డిచ్‌పల్లి బస్టాండ్ పక్కన గల చెరువులో ధర్పల్లి మండలం చల్లగరిగే గ్రామానికి చెందిన మీసాల సాయిలు(54) సోమవారం చేపల పట్టేందుకు చెరువలోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడని ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుని కుమారుడు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రకటన జారీ చేశారు.

రోడ్డుపై వడ్లకుప్పను ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడు

● తీవ్ర గాయాలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృతాపూర్ గ్రామానికి చెందిన కుందేటి శ్రీకాంత్ అమృతాపూర్‌నకు తనబైకుపై వెళ్తుండగా ఆదివారం అర్ధరాత్రి డిచ్‌పల్లి పెద్దమ్మ మందిరం వద్ద రోడ్డు పై ఉంచిన ధాన్యం కుప్పను ఢీకొనడంతో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి తలకు తీవ్రమైన గాయాలు అయి అపస్మరక స్థితిలోకి వెళ్లిపో యినట్లు స్థానికులు తెలిపారు. చికిత్సకోసం జిల్లాకేంద్రఆసత్రికి తరలిం చారు.

● రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తీసుకుంటాం : ఎస్సై

రైతులు పండించిన వరిధాన్యం రోడ్లపై ఆరాబోస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన ధాన్యం ఖాళీ స్థలాల్లో లేదా వ్యవసాయ భూముల్లో ఆరాబోసుకోవాలని రోడ్లపై ధాన్యం ఆరాబోసి వాహనదారుల ప్రమాదాలకు కారణంకావొద్దని హెచ్చరించారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

బోధన్‌రూరల్,ఏప్రిల్29: సాలూర మండల కేంద్రానికి చెందిన మహదేవ్ చంద్రకాంత్‌గిరి(26) అనే వ్యక్తి గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మద్యానికి బానిసైఆదివారం చెరువులోదూకి ఆత్మహత్య చేసుకున్నాడని, సోమవారం మృతదేహం బయటకు రావడంతో పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

ఫాసిస్ట్ మూక దాడులను ఖండించాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: కాకతీయ యూనివర్సిటీలో జరిగిన లౌకిక విలువలు సాహిత్యం అనే సదస్సులో చొరబడి పాసిస్ట్ మూక అల్లర్లు సృష్టించడం తగదని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ఖండించారు. ఈ సమావేశంలో నరేందర్, గణేశ్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలతో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారు :అర్వింద్



మెండోరలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

మెండోర,ఏప్రిల్29: మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి అన్ని వర్గాల ప్రజలు మోసపోయా రని ఇప్ప టికైనా వారి మాట లు నమ్మిమోసపోవద్దని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్విం ద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి అర్వింద్ మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుపు బోర్డు రాలేదని తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఇదే నిజామాబాద్ జిల్లాలో రైతు ఉదయమ నాయకుడు ముత్యాల మనోహర్ రెడ్డి పసుపుబోర్డు వచ్చే వరకు కాళ్ళకు చెప్పులు తొడగను అని 11ఏళ్ల కాళ్ళకు చెప్పులు లేకుండా ఉన్నాడని నరేంద్రమోదీ పసుపుబోర్డు ప్రకటించగానే చెప్పులు తొడిగడని ఇది కూడా అబద్దమేన అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేరలేదని దేశాన్ని కాపాడే నరేంద్రమోదీని గెలిపించుకుంటే దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర రైతు నాయ కుడు కోటపాటి నర్సింహంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు నడ్పన్న, నోముల సాయరెడ్డి, ఆల్లూరి ముత్యంరెడ్డి, కొమ్ముల రమేష్, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ టెక్నికల్ కోర్సు కోసం అభ్యర్థులు హాజరుకావాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: ప్రభు త్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో టైలరింగ్, డ్రాయింగ్, మ్యూజిక్ టీచర్స్ సర్టిఫికెట్ సమ్మర్ ట్రైనింగ్ కోర్సు మే 1వ తేదీ నుంచి జూన్ 13 వరకు 42 రోజుల పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు. సంబంధిత కోర్సు కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మే 1వ తేదీ ఉదయం 9 గంటలకు కోర్సు డైరెక్టర్‌కు రిపోర్ట్ చేసి టీటీసీ ట్రైనింగ్‌లో హాజరుకావాలని ఆయన కోరారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



గోవర్ధన్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రశాంత్ రెడ్డి

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో అధికారంలోకి వచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హమీలు నేరవేర్చడంలో విఫలమయిందని బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మవద్దని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని ఉప్లూర్, కమ్మర్‌పల్లి గ్రామాలలో ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ అంటు టోపీలు పెడుతున్నారని, అదిగోఇదిగో అంటు కాలయాపన చేస్తువస్తున్నారని డిసెంబర్ 9న ఆరుగ్యారంటీలపై తొలిసంతకం అన్నారు. కాని వందరోజులు దాటిన ఉచిత బస్సుతప్ప ఏది అమలు లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసగించి అధికారం చేపట్టారని మళ్లీ అదే ధోరణితో గ్రామంలోకి వస్తూ మాయ మాటలు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వంద రోజుల గడువు దాటినా హామీలు ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. పసుపు బోర్డు తీసుకువస్తానని హామీ ఇచ్చిన అర్వింద్ ఐదెల్ల పాలనలో ఒరగబెట్టింది ఏది లేదని ఏఒక్క గ్రామానికి నిదిలు అందించిన దాఖలాలు లేవని విమర్శించారు. పసుపుబోర్డు తీసుకురాలేదని, అలాంటి వ్యక్తికి ఓట్లు అడిగే నైతిక హక్కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఎంపి అభ్యర్థిగా ప్రజానాయకుడిగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, ఎంపీపీ లోలపు గౌతమి, పార్టీ అధ్యటఉడు రేగుంట దేవేందర్, బద్దం చిన్నారెడ్డి,మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్29: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలలో భాగంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం గ్రామశివారులో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్ళి ఓటును అభ్యర్థించారు. కారు గుర్తుకు ఓటు వేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మెట్టు సంతోష్, బీఆర్ఎస్ నాయకులు ఇట్టెడి లింగారెడ్డి, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ పరీక్షలు నాలుగో రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పదో తరగతి సైన్స్ పరీక్షకు మొత్తం 1613 మంది హాజరుకావాల్సి ఉండగా 1468 మంది హాజరుకాగా 145 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ కామర్స్ పరీక్షకు 769 మందికి గాను 695 మంది హాజరుకాగా 74 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షకు 83 మందికి గాను 78 మంది హాజరుకాగా 5 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ ఫిజిక్స్ పరీక్షకు మొత్తం 392 మందికి గాను 362 మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడ కూడా మాస్‌కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు.

పాంగ్రాలో పీఎఫ్ చందాదారుల సమావేశం

పెద్దబజార్, ఏప్రిల్ 29: పీఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో వరుణ్ మోటార్స్‌లో పీఎఫ్ చందాదారుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, మేనేజర్ రమేష్‌లు పాల్గొన్నారు. ఈపీఎఫ్ సంస్థకు సంబంధించి పీఎఫ్ చందాదారులు, పెన్షన్‌దారులు ఈ సమావేశానికి హాజరుకావడంతో వారి సమస్యలను అధికారులు పరిష్కరించారు. పీఎఫ్ దరఖాస్తు, పేరు మార్పిడి, పెన్షన్‌కు సంబంధించిన వివరాలను వారికి వివరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

ఎడపల్లి, ఏప్రిల్ 29: ఎడపల్లి మండలంలోని గౌడ కులస్థులు సోమవారం ఎల్లమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలు శుక్రవారం నుండి ప్రారంభించారు. అందులో భాగంగా నేడు ఉదయం కాటమయ్య బోనం ఎదుర్కొని, గంగా బోనంతో పుట్ట బంగారం గంప తీసుకుని ఎల్లమ్మ గుడికి వచ్చి కాటమయ్య బోనం సమర్పించి, గంగా బోనంను చెరువులో తెప్పతీసి, పుట్టకు దనిపోసి మైలపోలు తీసి సుంకుదంచి అమ్మవారికి చిత్రకన్ను దిష్టి తీసి కూరండ్లు పట్టారు. అనంతరం సాయంత్రం ఏడంత్రాల బోనం ఎదుర్కొన్నారు. అనంతరం ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎగపల్లి గ్రామ గౌడ కులస్థులు పాల్గొన్నారు.

కోటగిరిలో ధాన్యం ఇవ్వాలని రైతుల ధర్నా

కోటగిరి,ఏప్రిల్29: కోటగిరి మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిల్వ చేసిన ధాన్యాన్ని తిరిగి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. కోటగిరి మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట సోమవారం మరోమారు రైతులు ధర్నా నిర్వహించారు. రెండు రోజుల క్రితం మార్కెట్ కమిటీ కార్యాలయంలో డీడీలు ఇచ్చేందుకు వెళ్లిన అధికారులు అందుబాటులో లేకుండా పోయారు. మరోమారు డీడీలను కార్యాలయంలో ఇచ్చేందుకు వెళ్లగా కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 45రోజులుగా మార్కెట్ కమిటీ కార్యాలయానికి విధులకు హాజరు కావడం లేదని రైతులు ఆరోపించారు. ధాన్యం తిరిగి తీసుకునేందుకు కోర్టు నుంచి ఉత్తర్వులు జారీ అయిన అధికారులు పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ధాన్యాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోదాంలో ఉన్న ధాన్యం తీసుకుని అమ్ముకుంటామని రైతులు తెలిపారు. ప్రస్తుతం ధాన్యానికి మంచి ధర ఉందని, ఈ సమయంలో అమ్ముకుంటే మేలు జరుగుతుందన్నారు. ధాన్యం ధర తగ్గితే తాము నష్టపోవాల్సి వస్తోందని అధికారులు స్పందించి తమ ధాన్యాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఏఎంసీ చైర్మన్ గంగాధర్, రైతులు నాగనాథ్ పటేల్, హన్మంత్ రావు, సాదక్, జగన్, ఫారూఖ్, బాబు ఖాన్, ఈర్వంత్ రావు తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

ఆగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ చేసితీరుతాం

● నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్29: రానున్న ఆగస్టు నెలలోగా రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని కేశ్‌పల్లి, పడకల్, కలిగోట్, చింతలూర్ గ్రామాల్లో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చిన నాలుగు నెలల్లో తెలంగాణలో 35కోట్ల మంది మహిళలు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణించి సద్వినియోగం చేసుకున్నారన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్‌కార్డులు ఇచ్చే బాధ్యత నాదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీగా జీవన్‌రెడ్డి భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారన్నారు. కేంద్రం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఐదు గ్యారంటి పథకాలను అమలు చేసి తీరుతామన్నారు. కేంద్రంలో బీజేపీని గద్దెదించాలంటే చేతిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మాజీఎంపీపీలు అప్పాల రాజన్న, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

ఓటర్లకు అవగాహనపై సీబీసీ ఫోటో ప్రదర్శన



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకురాలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 29: ప్రతి ఓటరు నిజాయితీతో ఓటు వేయడం ద్వారా చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఊతం ఇవ్వాలని ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ అర్ పిలుపునిచ్చారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపుదిశగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల ఛాయాచిత్ర ప్రదర్శనను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు చైతన్య ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని ... దనించదగ్గ విషయమని సమాజంలోని విద్యావంతులు, ప్రజలు ఓటు విలువ తెలుసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో నిజాయితీగా ఓటు వేయాలన్నారు. యువత ఓటు వినియోగించడంలో నిజాయితీని ప్రదర్శించాలన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా విలువైందని ప్రజలు దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శన మే1వ తేదీ వరకు కొనసాగుతుందని 1951 నుంచి ప్రారంభమైన భారత ఎన్నికల చరిత్ర, మొబైల్ యాప్‌లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వరకు అన్ని అంశాలను ప్రదర్శనలో వివరించారు. ఈ కార్యక్రమంలో సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మనాయక్, టీఎస్ఆర్టీసీ ఆర్ఎం జాన్‌రెడ్డి, స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● స్ట్రాంగ్‌రూంల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలను సోమవారం రాష్ట్ర ఎన్నికల అధికారిణి ఎలిస్ వజార్ పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్ర పరిచిన గదులను ఆమె పరిశీలించారు. భద్రత విషయంలో ఏసీపీ బస్వారెడ్డితో చర్చించారు. ఆమె వెంట ఏసీపీ బస్వారెడ్డి, ఎస్‌హెచ్‌వో రవికుమార్, తహసీల్దార్ గజానన్, ఆర్‌ఐ అశోక్‌సింగ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



నందిపేట మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్29: రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఆలూర్ మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులందరు తనకు అండగా నిలవాలని కోరారు. ఆర్మూర్ ప్రాంతం వ్యవసాయ రంగంలో ఎంతో ఖ్యాతి గడించిందని, మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. తనను గెలిపిస్తే రైతులకు అండగా నిలిచి సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, తలారి పోశన్న, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: కాంగ్రెస్ పార్టీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలోని నంది విగ్రహం వద్ద కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు మచ్చర్ల సాయిరెడ్డి, దేగం గంగారెడ్డి, పెంట ఇంద్రుడు, మంద మహిపాల్, బైండ్ల ప్రశాంత్, నిఖిల్, తదితరులు ఉన్నారు.

డొంకేశ్వర్: రైతాంగానికి పంటకు నీళ్లు అందించేందుకు లిఫ్టులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి డొంకేశ్వర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదప్రజలకు ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, దేగంగంగారెడ్డి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: తెలంగాణ రాష్ట్ర బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుంపల నారాయణ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా నారాయణ కు ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువ వేసి స్వాగతం పలికారు.

మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

● మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావు

బోధన్‌రూరల్,ఏప్రిల్29: ఇటీవల బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త, సీనియర్ రాజకీయ నాయకుడు బుద్దె రాజేశ్వర్ గుండెపోటుతో మృతి చెందడంతో సోమవారం మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట శివన్నారాయణ, కొడాలి రవి కుమార్, ఇల్తెపు శంకర్, సాలూర షకీల్, అల్లె రమేష్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కేసులు

ఖిల్లా, ఏప్రిల్ 29 :పోలీసు శాఖ నిబంధనలను ఉల్లంఘించి వ్యాపారాలు కొనసాగించే వ్యాపారులపై కేసులు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరుచడం జరిగిందని రెండో టౌన్ ఎస్ఐ. ఎల్.రాం తెలిపారు. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ ఆదేశాల మేరకు నగరంలో ఎటువంటి ఘటనలు జరుగకుండా ఉండేందుకు రాత్రి 10.30గంటల అనంతరం వ్యాపారసముదాయాలు తెరచి ఉంచి వ్యాపారలావాదేవీలు నిర్వహించకుండ చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఆదేశాలపై ఆదివారం రాత్రి తనిఖీలు చేశామన్నారు. ఈ తనిఖీల్లో సిటీ పోలీసు చట్టంను ఉల్లంఘించి వ్యాపారాలు చేస్తున్న మహ్మద్ యాసిన్, గాజుల దుకాణం, షేక్ ఖలీల్‌అహ్మద్ గాజుల షాపు, షేక్ అజార్, సనా గాజుల షాపు, మహ్మద్ వాజిద్, జియాచాయ్ హోటల్‌లను అదుపులోకి తీసుకుని సోమవారం ఉదయం కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరికి ఒక్కొక్క రోజు సాధరణ జైలు శిక్షను 2వ తరగతి మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ విధించారన్నారు.

న్యాయవాద సంక్షేమ సహకార సొసైటీ డైరెక్టర్ల నియామకం

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 29: జిల్లా న్యాయవాదుల సంక్షేమ సహకార సొసైటీ 2024-25 వార్షిక ఎన్నికలలో ఏకగ్రీవంగా ప్రెసిడెంట్‌గా ఎం.రాజారెడ్డి, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా శ్రీనివాసచక్రవర్తి, ఉపాధ్యక్షుడిగా వెంకట్‌రావు, ఉమ్మడి కార్యదర్శి శంకర్, డైరెక్టర్లుగా వెంకటరమణా గౌడ్, సంతోష్‌నాగ్‌లు ఎన్నికైనట్లు ఎన్నికలఅధికారులు ఎర్రం విఘ్నేష్, శైలేష్‌లు తెలిపారు. అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులకు ఎల్లవేళలా సొసైటీ ద్వారా ముందస్తు అభివృద్ధి చర్యలు చేపట్టి సొసైటీ ద్వారా ఈ వార్షిక సంవత్సరంలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

బీఆర్ఎస్ బూత్ కమిటీల ఎన్నిక



నవీపేటలో బీఆర్ఎస్ బూత్ కమిటీలను ప్రకటిస్తున్న జడ్పీ చైర్మన్

నవీపేట,ఏప్రిల్29: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం బూత్ స్థాయి కమిటీలను జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు ప్రకటించారు. రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ రావు, లోకం నర్సయ్య, సూరిబాబు, అంజలి, పోసాని తదితరులున్నారు.

డీసీఎం వ్యాన్ బోల్తా పలువురికి గాయాలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్29: మండలంలోని అర్గుల్ గ్రామంలో 44వ జాతీయరహదారిపై సోమవారం రాత్రి డీసీఎం వ్యాన్ బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై సీహెచ్.తిరుపతి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రాజమ్మ,ఎల్లయ్య దంపతుల కూతురు స్వరూపను జగిత్యాల్ జిల్లా మెట్‌పల్లి ఇచ్చారు. మాదాపూర్ నుంచి డీసీఎం వ్యాన్‌లో సుమారు 12మంది మెట్‌పల్లిలో స్వరూప కూతురు సారి ఫంక్షన్‌కు వెళ్తుండా అర్గుల్‌లోని 44వ జాతీయరహదారిపై డీసీఎం వ్యాన్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొందని ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంలో 12మందికి గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్థాపంతో వృద్ధురాలి మృతి

ముప్కాల్, ఏప్రిల్29: వేర్వేరు ప్రమాదాల్లో కొడుకు, కూతురు మృతి చెందడంతో మనస్థాపం చెంది అలెపు రుక్మబాయి (59) ముప్కాల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. 20ఏళ్ల క్రితం మృతురాలి భర్త చనిపోవడంమే గాక ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో కొడుకు కూతురు చనిపోవడంత కొడలి దగ్గర ఉంటూ కూలీ పని చేస్తూ జీవిస్తున్నా కొడలితో గొడవ పడి మనస్థాపం గురై సోమవారం ఉదయం చెరువులో దూకి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,200	రూ.67,525	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1 : రత్నం (11.30, 2.45, 6.00, 9.15)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (1.25, 7.10)
: మంజుమ్మల్ బాయ్స్ (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.05)
స్క్రీన్-3 : మంజుమ్మల్ బాయ్స్ (1.00)
: టిల్లు స్క్వేర్ (4.00, 10.35)
: ది ఫ్యామిలీస్టార్ (7.10)
స్క్రీన్-4 : ది ఫ్యామిలీస్టార్ (1.10)
: కొంచెం హటకే (తెలుగు) (4.35)
: మంజుమ్మల్ బాయ్స్ (7.15, 10.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1 : రత్నం (1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (10.45,4.40,7.30,10.30)
: టిల్లు స్క్వేర్ (1.40)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : హ్యాపీడేస్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : రత్నం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్